కథ

# పెళ్ళికాని ప్రేమకధ

జి. మురళీధర్



**ఆ**టో లో వెళుతున్న శ్రీలహరి. ఆ ఆటోని ఒక స్కూటర్ 'ఢీ' కొట్టటంతో భుజానికి గాయమై హాస్పిటల్లో చేరిందని తెలిసి నాగమణి పలకరించటానికి వచ్చి వివరాలు తెలుసుకుంది.

"అసలు మనవాళ్ళకి క్రమశిక్షణ, నిజాయితి, తెలివితేటలు లేవని చెప్పాలి లహరి! లేకపోతే ఏమిటి? రోజుకి దేశంలో ఎన్ని ఏక్సిడెంట్స్ జరుగుతున్నాయి? డొక్కు బండ్లను తోలటం, విశ్రాంతి లేకుండా తోలటం, తాగి తోలటం అసలు మన వ్యవస్థలోనే లోపం ఉంది. అమెరికాలో రోడ్‌మీద పోతున్న వాహనానికి మరో వాహనం ఎదురురాదు. యాక్సిడెంట్ జరగటం చాలా అరుదు. అదే మన ఇండియాలో అయితే ఊళ్ళోనే అన్ని వాహనాలు మనుష్యులు ఎదురు బొదురు రాకపోకలే. ఎప్పుడు మారుతుందో ఈ పరిస్థితి".

తనున్నది హాస్పిటల్ అన్న సంగతి కూడా మరిచిపోయి నాగమణి అనర్గళంగా ఇంగ్లీషులో స్వదేశాన్ని విమర్శిస్తోంది. ఆ సమయంలో శ్రీలహరిని చూడటానికి జూనియర్ డాక్టర్ దయానిధి అక్కడికి వచ్చాడు. నాగమణి చిరు ఉపన్యాసం హాస్పిటల్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నా ఆమె స్పష్టమైన ఇంగ్లీషు ఉచ్చారణ చక్కని పదప్రయోగం, విషమ పరిశీలన, తెలిసిన దానిని ధైర్యంగా బయటికి చెప్పటం చూసి వారించలేక పోయాడు.

నాగమణి ఒక ప్రయివేటు కాలేజీలో ఇంగ్లీషులెక్చరర్‌గా పనిచేస్తూ నెలకు పదివేలు సంపాదిస్తోంది. అందరూ తన గురించి గొప్పగా చెప్పుకునే స్థాయికి ఎదగాలని ఆమె కోరిక. అమెరికా వెళ్ళిన వారు చెప్పే విషయాలు ఆ దేశ వైభవం విని అక్కడే స్థిరపడాలని నిర్ణయించుకుంది. ఎందుకైనా మంచిదని కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటోంది. అమెరికాలో స్థిరపడిన వారు పరిచయమైతే తన అభిలాష తెలియచేస్తోంది. పెళ్ళికూడా చేసుకోకుండా అమెరికా సంబంధం కోసం ఎదురు చూస్తోంది. ఒకసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించె రూపం ఆమెది. తెల్లని వర్ణం, ఆరోగ్యవంత మైన శరీరం, మనస్సులోని ఉత్సాహం కళ్ళలో మెరుపుల ద్వారా వ్యక్తమవుతూంటే చూసే వారికి వింత అనుభూతి కలిగి, ఆమె చెప్పేది వింటారు బొమ్మల్లాగ.

డాక్టర్ దయానిధి అమెరికాలో పై చదువులకి

వెళ్ళటం ఖాయమైందని శ్రీలహరి చెప్పినప్పుడు, నాగమణి అతనికేసి పరిశీలనగా చూసింది. దయానిధి నలుపు, అందగాడుకాదు. ఆమె వాటి గురించి పట్టించుకోలేదు. అతను అమెరికా ఉద్యోగం పొందితే అతన్ని పెళ్ళిచేసుకుని అక్కడ స్థిరపడాలని ఆమె 'ఆలోచన' అంతే. తన అందానికి వాక్చాతుర్యానికి డాక్టర్ దయానిధి ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడని ఆమె పూర్తిగా గ్రహించింది. కాని, ఆమె అందం, వాక్చాతుర్యానికి లొంగి ఆమెను ప్రేమించినవారు అమెరికాలో స్థిరపడకపోతే ఎలా మోసపోతారో దయానిది ఊహించలేకపోయాడు.

ఇంటికి చేరిన తరువాత కూడా నాగమణి వాగ్ధాటి అందం దయానిధిని వదిలిపెట్టలేదు. అతని గురించి నాగమణి, నాగమణి గురించి అతను ఇలా ఇద్దరూ శ్రీలహరి నుంచి వివరాలు తెలుసుకున్నారు. శ్రీలహరి హాస్పిటల్లో ఉన్న మూడు రోజులూ నాగమణి వచ్చి వెళ్ళింది. ఆ పరిచయంతో ఇద్దరూ పిచ్చాపాటి మాట్లాడుకోవటం, ఆ తరువాత ఫోన్‌లో, బయట, పార్టీల్లోనూ మాట్లాడుకోవటం, అలా ఒకరిఆశయాలు ఒకరు వివరంగా చెప్పుకున్నారు.

దయానిధి ఎడారి జీవితంలో నాగమణి ఒయాసిస్ అయింది.

నిజం చెప్పాలంటే అతనికి అమెరికా వ్యామోహం లేదు. పై చదువులు చదవాలని కూడా లేదు. తన దగ్గర బంధువులు చదువుకోమని స్థిరపడమని ఆహ్వానించటం సాయం చేస్తామని మాట ఇవ్వటం వల్ల ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ సిస్టమ్ (ఇల్ట్స్)కు ప్రిపేరయి మొదటి ఛాన్స్‌లోనే సెలక్టయ్యాడు. సర్టిఫికెట్ వచ్చింది. చదువుకోవటానికి అమెరికాలో జరిగే ఎంట్రన్స్, ఇంటర్వ్యూలను తట్టుకునే ధైర్యం ఉంది.

నాగమణిని వదిలి అమెరికా వెళ్ళటం అతనికి పెద్దగా ఉత్సాహం లేదు.

ఆ సంగతి ఒకరోజు నాగమణితో చెప్పాడు అతను అమెరికా ప్రయాణం మానుకోవటం ఆమెకు అసలు ఇష్టంలేదు. తప్పతాగి కులం మరచినట్లున్న అతని మాటలు ఆమెకు కోపం కలిగించాయి. దయానిధి చేతిని తన చేతిలోకి తీసుకుని నెమ్మదిగా వత్తుతూ అంది.

"చూడు డార్లింగ్! జీవితం అంటే కేవలం భావుకత కాదు. ఒక కఠోర సత్యం. జీవితంలో తళుకులు బెళుకులు చూసి మురిసిపోతూ చతికిలబడితే ఎవరూ పైకి రారు. బావిలో కప్పలా సుఖంగా బతికితే సరి పోతుందా? నీలాంటి తెలివి గలవాడు. క్రమశిక్షణ నిజాయితి గలవాడు అమెరికాలోనే పైకి రాగలడు. అక్కడికి వెళ్ళటానికి బెంగ ఎందుకు? నేనూ అక్కడికి వస్తాగా! కాకపోతే కొంత ఆలస్యం కావచ్చు. దాని కోసం చేతికందిన సువర్ణవకాశాన్ని వదులుకోవటం ఏమైనా బాగుంటుందా? ఎన్ని దేశాల నుంచి ఎన్నివేలమంది అమెరికాలో స్థిరపడాలని కలలు కంటున్నారో నీకు తెలియదు. గ్రీన్‌కార్డు వచ్చాక మనల్ని ఎవరూ విడదీయలేరు.

ఆ మాటలు దయానిధి పైన పనిచేసాయి. 'విరహము కూడా సుఖమె కాదా' పాత సినిమాపాట, పల్లవి గుర్తు చేసుకుని తనను తాను సముదాయించుకున్నాడు.

నాగమణి స్నేహితుల్లో శ్రీలహరికి మాత్రమే ఈ పెళ్ళికాని ప్రేమ కథ తెలుసు. దయానిధిలోనే ఎక్కువ నిజాయితి, అమాయకత్వం ఉందనికూడా తెలుసు. అందుకని ఒక రోజు సాయంత్రం శ్రీలహరి, నాగమణి దగ్గర ఈ పెళ్ళి ప్రసక్తి లేవదీసింది.

"చూడు నాగమణి! దయానిధి సంగతి బాగా ఆలోచించు. నువ్వు అతన్నిపెళ్ళి

**ద్వారం జయంతి**

ద్వారం వెంకటస్వామి నాయుడు 8-11-1893న జన్మించారు. విజయ నగరం మహారాజావారి సంగీత కళాశాలలో సంగీతం నేర్చుకున్న నాయుడు గారిని నాటి కళాశాల ప్రిన్సిపాల్ ఆదిభట్ల వారు ఉపాధ్యాయునిగా నియమించారు. వయోలిన్‌పై ద్వారం వారు వివిధ రాగాలను పలికించే తీరు రసజ్ఞులను తన్మయులను చేసేది ఫిడేలు నాయుడి'గా ప్రసిద్ధుడైన ద్వారం వారికి 1941లో మద్రాసు సంగీత నాటక అకాడమీ 'సంగీత కళానిధి' బిరుదాన్నిచ్చింది.

చేసుకోవటం మీ ఇంట్లోవారు ఇష్టపడరు. ఎందుకంటే అతను క్రిష్టియన్, పైగా నలుపు. నువు హిందు, పైగా బంగారు వన్నెగల అందకత్తెవి. అమెరికా ప్రభుత్వం వీసాల కోట బాగా తగ్గించింది. గ్రీన్‌కార్డులు రావటం కూడా కష్టమే. బుష్ రెండవసారి ప్రసిడెంటయ్యాక ఈ మార్పులు తెచ్చాడు".

"అబ్బా! ఏమిటె అమ్మమ్మ పోరులా మాట్లాడుతున్నావు. పెళ్ళినాకా?నీకా? నేను అతన్ని తమాషాకి ప్రేమించానంటావా నీకో సంగతి చెప్పాలి. ఎల్లుండి సోమవారం వైస్‌రాయ్ హోటల్లో దయానిధికి ఫేర్‌వెల్ కమ్ మ్యారెజ్ పార్టీ. ఈ ప్రపోజల్ నాదే. అతను కూడావెంటనే ఒప్పుకున్నాడు. ఇలా సడన్‌గా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నాననేగా నీ అనుమానం? అతను అమెరికా వెళ్ళాక మరో అందగత్తెతో ప్రేమలో పడితే - నా పరిస్థితేమిటి?"

"దయానిధిమీద నీకున్న నమ్మకం ఇంతేనన్న మాట".

"నువ్వు మా అమ్మమ్మకి అమ్మకాలంలో పుట్టాల్సిందానివి. సరె.... ఈ గొడవంతా ఎందుకు. ఎల్లుండి జరిగె మా పార్టీలో చాల తక్కువ మందితో రహస్యంగా ఎరేంజ్ చేస్తున్నాను. నువు వచ్చి ఫోటోలోనూ, వీడియోలోను కనబడు. చాలు"

పెళ్ళి కాకుండా మ్యారెజ్‌పార్టీ చేసుకోవటం దయానిధికి కూడా ఇష్టంలేదు. క్రైస్తవ మతాచారం ప్రకారమైన లేదా హిందూ మతాచార ప్రకారమైన తమ వివాహం జరగాలనిఉందతనికి కాని నాగమణి వాగ్ధాటికి తలవంచాడు. శ్రీలహరి కూడాఆమెను వారించి భంగపడింది. సాంప్రదాయ ప్రకారం జరిగే పెళ్ళికి ఏ దేశంలోనైనా ఎంతో విలువ ఉంటుందని వధూవరులకు ఎంతో గౌరవం దక్కుతుందని కావాలనుకుంటే ఆ పెళ్ళిని రిజిష్టర్ చేసుకోవచ్చని కూడా చెప్పి చూసింది శ్రీలహరి. కాని, నాగమణి తన మొండిపట్టు వదలలేదు.

ఇరువురి పెద్దలకుకూడా తెలియకుండా షుమారు 20మంది మిత్రులతో రహస్యంగా నాగమణి దయానిధి హోటల్‌కు చేరుకుని పార్టీ ముగించారు. చాలామందికి అది ఫేర్‌వెల్ పార్టీ కాని శ్రీలహరి లాంటి ఇద్దరు ముగ్గురు ప్రాణస్నేహితులకు అది కాబోయె వధూవరుల మ్యారేజ్ పార్టీ.

రెండు వారాల తర్వాత దయానిధిన్యూయార్క్‌కు పోవాలి. సన్నాహాలు అన్నీ పూర్తి అయ్యాయి.

తెల్లవారు ఝామున మూడు గంటలకు ఫ్లైట్. చివరి రోజంతానాగమణి అతన్ని అంటిపెట్టుకుని, గంట గంటకు

"డియర్! సాధ్యమయినంత త్వరలో మన పెళ్ళి జరిపించి, నన్ను నీ దగ్గరకు పిలిపించుకునే బాధ్యత నీదే అని మరచిపోకు" అని చెబుతూనే వుంది.

"నాకు కూడా నిన్ను వదిలి ఉండటం కష్టమే. తప్పకుండా ప్రయత్నిస్తాను" అని తన బలమైన చేతులతో ఆమెను కౌగలించుకున్నాడు.

దయానిధి అమెరికా వెళ్ళిన తరువాత నాగమణికి బోర్ కొట్టసాగింది. దయానిధి మీద ప్రేమతో తను పక్కకు తోసేసిన పాత స్నేహితులతో మళ్ళీ స్నేహాన్ని కొనసాగించాలని నిర్ణయించుకుంది.

మంగనాధాచార్యులుకి ఫోన్ చేసింది.

"హల్లో నాగమణిగారు! చాలాకాలం తరువాత ఫోన్ చేసారు. సీక్రెట్‌గా అదేదోపెళ్ళిలాంటి పార్టీ చేసారట. ఎందుకండీ కొత్తఆచారాలు మొదలు పెడతారు? మీ ఆయన్ను మీ అదృష్టాన్ని చూసి అసూయ పడతామనుకున్నారా?....ఏదైతే ఏమిలే... కాబోయే వధూవరులకు నా శుభాకాంక్షలు" అన్నాడు.

నాగమణి బిత్తరపోయింది. తను ఎంతో రహస్యంగా పార్టీ చేసుకున్నా, అది అందరికీ తెలిసిపోయింది. నాగమణికి మానసిక అశాంతి ఎక్కువయింది. నిద్ర తక్కువయింది. రాత్రిళ్ళు నిద్రపోవటానికి నిద్రమాత్రలు వేసుకోవటం మొదలు పెట్టింది.

దయానిధివెళ్ళిన రెండు వారాలకి అతని వద్ద నుంచి ఇ-మెయిల్ వచ్చింది. తన చిరునామ కాలేజి చిరునామ వివరాలున్నాయి అందులో తరువాత నాలుగురోజులకి ఫోన్ వచ్చింది. అమెరికా వైభవం, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఠీవి, ఆసియా వారి వివరాలు చెప్పాడు. నెలరోజుల తరువాత ఉత్తరం వచ్చింది.

'ఇక్కడ లా అండ్ ఆర్డర్, రూల్స్ ఎండ్ రెగ్యులేషన్స్ చాల ఖఠినంగా పాటిస్తున్నారు. నిన్ను ఇక్కడకు తీసుకురావటానికి కొంత కాలం ఆగవలసి ఉంది. బహుశ రెండు మూడు సంవత్సరాలుపైనే పట్టవచ్చు అని ఉంది అందులో.

అమెరికాలో నాగమణికి ఏదైనా ఉద్యోగం గురించి దయానిధి విశ్వప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది.ఆ సంగతి వివరంగా చెప్పాడు కూడా.

ఆరునెలల తరువాత దయానిధి నుంచి మెసేజ్‌లు రావటం తగ్గాయి. ఒకోసారి ఫోన్‌లో కూడా దొరకటం లేదు. ఒకసారి "ఇక్కడవారు అనవసరంగా మాట్లాడుకోరు. నెలకో రెండు నెలలకో ఒకసారి మాట్లాడుకుందాము. అనవసరఖర్చు ఎందుకు చెప్పు? అన్నాడు.

దాంతో అతని మీద నాగమణికినమ్మకం కాస్త తగ్గింది.

రోజురోజుకు ఆమెకు నిరాశ నిస్పృహలు, ఆత్రుత ఎక్కువకాసాగాయి. వాటిని మరచి పోవటానికి ఆమె తన ఆత్మీయురాలు ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ అన్నపూర్ణఇంటికి వెళుతుండేది. ఆమె సాన్నిద్యం నాగమణికి ఎంతో ఉపశమనంగా ఉండేది. మళ్ళీ మనస్సు చురుకుగా పనిచేసేది.

ఒకరోజు సాయంత్రం అన్నపూర్ణగారి 25వ పెళ్ళిరోజు సందర్భంగా టీ పార్టికి నాగమణి కూడా వెళ్ళింది . అక్కడ శివకుమార్‌ని పరిచయం చేసింది అన్నపూర్ణ. శివకుమార్ అమెరికాలో పదేళ్ళనుంచి ఉద్యోగం చేస్తున్నాడు. గ్రీన్‌కార్డు, కారు, ఫ్లాట్, బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నాయి. ఇప్పుడు పెళ్ళిచేసుకుని భార్యని తీసుకుని వెళ్ళి ప్రశాంత జీవనం గడపాలను కుంటున్నాడు.

నాగమణి అతన్ని పరిశీలనగా చూసింది. చాలఅందంగా ఉన్నాడు. తరువాత ఆలోచనల్లో పడింది. దయానిధికి చదువు అయిన తరువాత అక్కడ ఉద్యోగం దొరుకుతుందా? దొరికినా, గ్రీన్‌కార్డు సంపాదించగలడా? చాలామంది ఆ పనులు చాల కష్టం. పూర్వంలాగా కాక ఇప్పుడు అమెరికా ఇమిగ్రేషన్ రూల్స్‌ని చాల కఠినం చేసిందని చెబుతున్నారు.

శివకుమార్ ఒంటరిగాకుర్చీలో ఉన్న సమయంలో నాగమణి మాట కలిపింది.

"అందరూ కూల్‌డ్రింక్స్ తీసుకుంటున్నారు. మీరేమి తీసుకోకుండా ఒంటరిగా కూర్చున్నారే? కాఫీ, టీ ఏమైనాకావాలా? "ఇంగ్లీష్‌లో అడిగింది.

"థాంక్స్! ఏమీ వద్దండి"

"బైది బై... నా పేరు నాగమణి అని అన్నపూర్ణగారు పరిచయం చేసారు. గుర్తుందా? మనిద్దరి పేర్లు కలిసినట్లుగా అనిపిస్తోంది. మీరు అన్నపూర్ణగారికి బంధువులా?"

"కాదండి, వీరి బంధువులు కొందరు అమెరికాలో నాకు బాగా స్నేహితులు. మాదీవూరె కాబట్టె ఇక్కడికి వచ్చినపుడు వీళ్ళింటికి వెళ్ళమని నా ఫ్రెండ్స్ అడుగుతుంటారు.

ఆమెకు సంభాషణ ఇంకా పొడిగించాలని ఉంది.

"మీకు ఏ రచయిత అంటే ఇష్టం?"

"ఇష్టం అంటె...ఎలా చెప్పటం?" సాహిత్యం అంతా ఒక మూటగా లేదు. కథలు కవిత్వం, నాటకాలు, నవలలు,యాత్రా సాహిత్యం లేఖా సాహిత్యం, విమర్శ ఇలా ,ఉన్నాయి. నాగమణి మాట్లాడలేదు.

"వీటిలో కవిత్వం ఇష్టం. రవీంద్రనాథ్ ఠాగూర్ అంటె కాస్త అభిమానం ఎక్కువ.

"గీతాంజలి విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? సూటిగా అడిగింది.

"అది మతాలకి సంబంధం లేని ప్రపంచ ఆధ్యాత్మిక కావ్యం. రూపంలేని భగవంతుని ఆయన ప్రేమని ఠాగూర్ అందులో చూపిస్తారు."

"రూపం లేని భగవంతుణ్ణి గ్రహించే స్థాయికి ఇంకా మనవాళ్ళు ఎదగలేదు. భజనలు, పూజలుకూడా భగవంతుని అనుగ్రహం పొందవని కూడా ఆయన పరోక్షంగా అందులో రాసారు. భగవంతుడిని ఆరాదించే వాడికి మతం అక్కరలేదంటె మనవాళ్ళకి మింగుడుపడదు.

పాశ్చ్యాత్యులు దానికి నోబెల్ ప్రైజ్ ఇస్తే, దాన్ని మనం దొంగలపరం చేసేసాం. వాళ్ళు డూప్లికేట్ ప్రైజ్ ఇచ్చి రవీంద్రుని మీద అభిమానం చాటుకున్నారు. ప్రకృతి -భగవంతుడు ఒక్కటె అని అందులో మనకు రవీంద్రుడు చెప్పాడని నా గట్టినిర్ణయం.

> **న్యాయసేవాదినం**
>
> భారత రాజ్యాంగానికి 1976లో అధికరణ 39ఎ ను జతచేసి పేద బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిచడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించబడింది. దీనికి అనుగణంగా కేంద్ర ప్రభుత్వం 1984లో న్యాయసేవల అధికార చట్టం రూపొందించబడింది. ఆ తర్వాత ఎన్నో మార్పులు చేర్పులు చేయబడిన ఈ చట్టం 1985 నవంబర్ 9వ తేదీనుండి అమలులోని వచ్చింది. అప్పటి నుండి నవంబర్ 9వ తేదీన 'న్యాయసేవా దినం'గా పరిగణిస్తున్నారు.

నాగమణి వాగ్ధాటికి, చక్కని ఇంగ్లీషు ఉచ్చరణకి శివకుమార్ ముగ్ధుడయ్యాడు. అప్పుడే ఆమె చాల అందమైనదిగా కూడా గుర్తించాడు. విడిపో యెముందు ఆమె ఫోన్ నంబర్ తీసుకుని తన ఫోన్ నంబర్ ఇచ్చాడు. తరువాత రోజు ఆమె కార్యక్రమాలు తెలుసుకున్నాడు.

★ ★ ★

మరుసటిరోజు లైబ్రరి దగ్గర వాళ్ళిద్దరూ కలుసుకున్నారు. ఆమెను చూడగానె శివకుమార్ పలకరింపుగా నవ్వి, నాకోసం ఎదురు చూస్తున్నారా?" అన్నాడు.

"అవును! గీతాంజలి' గురించి నిన్న నేనన్నమాటలు మీకేమైన ఇబ్బంది గలిగించాయా అని నా అనుమానం."

"నేనెప్పుడు స్వంతంగా నిర్ణయాలు తీసుకుంటాను. ఆ పుస్తకం గురించి నేననుకున్నదే మీరన్నారు. నా ఆలోచన సరిగానే ఉందని మీ వల్లె తెలిసింది. కాని మీలాగా బయటికి అంత స్పష్టంగా చెప్పలేను"

నాగమణి నివ్వెరపోయింది.. ఇంత వరకు తన వాదనని ఇలా అభినందించినమగాడు తటస్థపడలేదు. ఆమె ఏమీ మాట్లాడకుండ ఆగిపోయింది.

"మాట్లాడరేం! నన్నలా ఆశ్చర్యంగా పరిశీలిస్తున్నారే?

"ఆ! ఏమి లేదండి, రండి, అలా హోటల్‌కెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాము"

"నాగమణి గారు! హోటల్లో టీ వగైరాలు తీసుకోవటం అదేపనిగా మాట్లాడుకోవటం నాకు నచ్చదు. మీరు ఇక్కడే మాట్లాడండి లేకపోతే మా ఇంటికి రండి ఫోన్ చేసిరండి" శివకుమార్ తన తండ్రి చిరునామా ఇస్తూ అన్నాడు.

నాగమణి ఏమీ మాట్లాడలేదు. ఇంతలో అటుగా ఆటో వస్తే అతను శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. అతని మాటలే ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి. శివకుమార్ తన మనస్సులోని మాటలు బయటికి చెప్పలేను అంటునే ఎంత నిర్మొహమాటంగా చెబుతు న్నాడు. అనుకుంది.

నాగమణి ఇంటికి చేరుకునే సరికి దయానిధి ఉత్తరంఎదురు చూస్తోంది. మునిపటిలా దాన్ని వెంటనే తెరవాలనిపించలేదు. మనస్సు చాల గందరగోళంగా ఉంది. శివకుమార్ - దయానిధి. ఎటూ నిర్ణయించుకోలేక పోతోంది. ఇంతలో ఆమె అంతరాత్మ జాగృతమయింది.

'ఇక ఆపు ఈ ప్రమాదకర నాటకాన్ని. దయానిధి నీ కాబోయే భర్త అని నీ మేరేజ్‌కమ్ ఫేర్‌వెల్ పార్టీలో అందరూ అనుకున్నారు. ఇపుడు శివకుమార్‌తో నీకు వివాహం అయితే కాలేజీలో నీకున్నవిలువ తగ్గిపోతుంది. ఉద్యోగం కూడా ఊడవచ్చు. బాగా ఆలోచించు.

నాగమణి ఉలిక్కిపడి భ్రాంతి నుంచి మామూలు స్థితికి వచ్చింది. ఏమిటీ ఆత్మఘోష? నేను శివకుమార్‌ని పెళ్ళిచేసుకుంటానని అనలేదుగా....!

'అనకపోతే ఏం? మనస్సులో అనుకుంటు న్నావుగా? కారణం - అతని దగ్గర గ్రీన్‌కార్డ్ ఉందనేగా, దయానిధి అదితేలేదని అనుకుంటున్నావుగా! మళ్ళీ ఆత్మఘోష

తెల్లవార్లు నిద్రపట్టక మంచం మీద పొర్లుతునే ఉంది. నాగమణి. తెల్లవారే సరికి ఏదో వెలితి, నిరుత్సాహం ఆమెలో గూడు కట్టుకున్నాయి. కాఫీ

తాగాక దయానిధినుంచి వచ్చిన కవరు చింపి చదివింది. ఏవేవో సంగతులతోపాటు మీరు త్వరలో అమెరికా రాబోతున్నారు అని ఉంది.

దాంతో తను ఇక శివకుమార్‌ని చూడకూడదని నిర్ణయించుకుంది. కాని ఆనిర్ణయం తాత్కాలికమె అయింది. రెండు రోజులయ్యేసరికి శివకుమార్‌ని చూడకుండ ఉండలేకపోయింది. ఆ సాయంత్రమే నీటుగాతయారై అతనింటికి బయలుదేరింది. నల్లంచు ముదురు నీలం రంగుచీర, నల్లరంగుజాకెట్‌తో మెరిసిపోతోంది. శివకుమార్ చిరునవ్వుతో ఆహ్వానం పలికాడు.

"ఫోన్ చేసి రమ్మన్నాను కదా?"

"అవుననుకోండి, మీరున్నా లేకపోయిన మిమ్మల్ని కలుసుకున్నాకే వెళ్ళాలని పించింది. మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలనిపించింది. మీరు పరిచయం అయినప్పటినుంచి నాకూ అమెరికా వెళ్ళాలనే ఆరాటం ఎక్కువయింది."

"ఒక్కోసారి ప్రతిమనిషికి సడన్‌గా ఆశ లేదా విరక్తి ఫీలింగ్స్ కలుగుతాయి. ఒక్కోసారి ఏమి చేయాలో తెలియని సందిగ్ధం ఏర్పడుతుంది. మీ మాటలు వింటుంటే మీరు నన్ను ప్రేమిస్తున్నట్లుందే....'

"మనం కాసేపు వంటరిగా ఎక్కడికైనా వెళ్ళి మాట్లాడుకుందామా?" నాగమణి, ఇల్లంతా చూస్తూ అంది. ''రండి, మేడ మీద గదిలో మాట్లాడుకుందాము'' శివకుమార్ పైకి దారితీసాడు.

నాగమణి, శివకుమార్‌ల వివాహానికి ప్రదానంజరిగింది.

ఈ విషయాన్ని వెంటనే శ్రీలహరి నమ్మలేకపోయింది. దయానిధికి ఈ విషయం చెబుదామంటే ఆమె దగ్గర అతని చిరునామ ఫోన్‌నంబరున్న కాగితంఎక్కడుందో కనబడలేదు. నాగమణితో కలసి మాట్లాడాలని, ఫోన్‌చేయాలని ప్రయత్నించింది, కాని ఆమె అందుబాటులో లేదు.

పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. పొద్దు తిరుగుడు పూవు సూర్యుడికేసి ఎదురు చూసినట్లుగా అమెరికా యోగం తెచ్చి ఈ పెళ్ళికోసం నాగమణి ఆత్రుతగా ఎదురు చూస్తోంది. ఆమె తల్లి దండ్రులు అన్న,చెల్లలు కూడా అమెరికా అల్లుడు దొరికినందుకు ఎంతో గర్వంగా ఫీలవుతున్నారు. కొంతమంది నాగమణిని చూసి అసూయ పడసాగారు.

ఆడపెళ్ళివారింట్లో చాల హడావిడిగా ఉంది. వరుడికోసం తెచ్చిన బట్టలు, వాచి, ఉంగరాలు ధగదగా మెరిసిపోతున్నాయి. వాటిని చూసి ఇంట్లో వారందరూ మురిసిపోతున్నారు.

ఇంతలో బయట మబ్బులు ముసిరి, ఈదురుగాలులు వీస్తూ మధ్యాహ్నామె చీకటిలా మారిపోయింది. ఇంతలో కాలింగ్ బెల్ పిడుగులా వినిపించింది. నాగమణి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా దయానిధి నిలబడి ఉన్నాడు. అతని చేతిలో గ్రీన్‌కార్డ్.

నాగమణి గుండెల్లో సునామి.

దయానిధి ఇంతత్వరగా గ్రీన్‌కార్డ్ తీసుకు వస్తాడని ఆమె అనుకోలేదు. చాలా మంది అలాగే అన్నారు. ఇప్పుడు తను ఎవరిని చేసుకోవాలి - దయానిధినా? శివకుమార్‌నా? నాగమణి శివకుమార్ వివాహం ఆగిపోయింది. దయానిధితో పెళ్ళి ఖాయపరచు కుని తనతో పెళ్ళికి సిద్ధపడ్డందుకు నాగమణిని శివకుమార్ నిరాకరించాడు. అదే కారణంతో దయానిధి కూడా ఆమెను నిరాకరించాడు. ఆమె ఎంత బ్రతిలాడిన వినకుండా తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు.

నాగమణి బంగారు కలల కొండ అగ్ని పర్వతంలా ప్రేలిపోయింది. దట్టమైన నల్లని బూడిద మిగిలింది. క్రమశిక్షణ నిజాయితిలేక తొందర పడేవారికి ఇలాగే జరుగుతుంది. ★

**గోరా జయంతి**

గోరా 15-11-1915న జన్మించారు. వీరి పూర్తిపేరు గోపరాజు రామచంద్రరావు దైవ భావన, కర్మ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా జీవితాంతం ప్రచారం చేశారు. కులమత రహితమైన సాంఘీక వ్యవస్థ, పార్టీ రహిత స్వామ్యం, హరిజనోద్ధరణలకు తన జీవితాన్ని అంకితం చేశారు. కులాంతర వివాహాలను నాస్తిక జీవితాన్ని గోరా తన కుటుంబంలో ఆచరించారు. 1968లో 'ది ఎథిస్ట్' అనే ఆంగ్ల మాసపత్రికను స్థాపించారు.